# వామన వృక్షం

## చిలుకూరి దీవెన

కుమ్మరి పురుగులాగా ఫైళ్ళన్నింటినీ తొలుచుకుంటూ బయటపడ్డాడు రాఘవేంద్ర. వాళ్ళ సూపరింటెండెంటు ఆ చుట్టుపక్కల ఎక్కడా లేడని నిర్ధారించుకుని ఫైళ్ళను తొలిచే కార్యక్రమంలో చెరిగిపోయిన క్రాఫ్‌ను కాస్త సర్దుకుని ఇంటికి బయలుదేరాడు.



ఆఫీసు స్టాఫంతా "ఈ కొత్తరంగు ఏమిటి?" అనే టీవీ అడ్వర్టైజ్‌మెంట్ మోడల్‌ని చూసినట్లు చూస్తుండటంతో తన చొక్కా కేసి చూసుకుని తనదేమీ తెల్లచొక్కా కాదే? నల్లని నిలువు గీతల చొక్కా, నల్లప్యాంటూ అనుకుని అప్రయత్నంగా వాచీని చూసుకున్నాడు.

'అదీ సంగతి! ఇప్పుడింకా 5 గంటలే కదా. అందుకా ఈ చూపులు' అని వాళ్ళందరి చూపులకు భాష్యం చెప్పుకున్నాడు. 'గవర్నమెంటు.. అందునా రెవెన్యూలో సీనియర్ అసిస్టెంటు అయిన తను ఇంత త్వరగా ఇంటికి బయలుదేరితే అదో వింతేమరి' అనుకున్నాడు.

"ఏంటిసార్! విశేషం?" అన్నాడు రాఘవేంద్రకు జూనియర్ అయిన సుబ్రమణ్యం. విశేషం లేనిదే ఏ రెవెన్యూ ఉద్యోగికీ ఇంత తొందరగా ఇంటికిపోయే అర్హతే లేనట్లు.

"అబ్బే ఏం లేదప్పా! ఎగ్జిబిషన్‌కు తీసుకుపొమ్మని మావాడు ఒకటే గోల పెడుతున్నాడు. ఇవాళ తీసుకెళ్ళామనీ" అన్నాడు దొంగతనం చేస్తూ పట్టుబడ్డ దొంగ సంజాయిషీ ఇస్తున్నట్టు మొహం పెట్టి.

'వెన్నెల' అపార్ట్‌మెంట్స్‌లో ఉంది రాఘవేంద్ర ఇల్లు. రెండవ అంతస్తులోకి లిఫ్ట్‌లో వెళ్ళగానే కుడివైపు నాలుగో ఇల్లే తనది. తలుపుకు ఇరువైపులా ఉన్న వామన వృక్షాలే అతనింటికి చిరునామా.

రాఘవేంద్ర భార్య సునీతకు వామన వృక్షాల్ని పెంచడమంటే ఎంతో ఇష్టం. కానీ రాఘవేంద్రకు మాత్రం వాటిని చూస్తే వాటి కన్నా భారీ సైజులో జాలి పుట్టుకొస్తూ వుంటుంది. మామూలుగా భూమిలో మొలకెత్తి, మొక్కై, చెట్టుగా ఎదగాల్సిన వాటిని, నువ్వింతే పెరగాలి. మా ఇష్టానికి మించి పెరగకూడదు అంటూ శాసించినట్టుంటుంది.

వాకిలి తెరిచే ఉండడంతో రాఘవేంద్ర లోపలకి వెళ్ళాడు. అది గమనించని సునీత వాళ్ళ కొడుకు నాలుగేళ్ళ వినోద్‌ను బలవంతంగా కూర్చోబెట్టి–

"జపాన్ పార్లమెంటుని డైట్ అంటారు. ఏదీ చెప్పూ.. పలకరా" అంటోంది వాడు.

"జపాన్ పార్లమెంటుని డైట్ అంటారు" అన్నాడు ముద్దుగా.

"అదీ! అట్లా నువ్వు బుద్ధిగా కూర్చొని, రోజూ

16 గంటల సేపు నేను చెప్పినవన్నీ నేర్చుకున్నావంటే, నిన్ను కూడా రవిగాడిలాగా అందరూ మెచ్చుకుంటారు. నువ్వూ బాలమేధావి అవుతావు. నిన్న గీతా ఆంటీ వాళ్ళు వచ్చినప్పుడు రవివాళ్ళ అమ్మ ఆంటీవాళ్ళ చేత ప్రశ్నలడిగించి, రవి చేత ఆన్సర్స్ చెప్పించింది కదా! అప్పుడు వాళ్ళు రవిని ఎత్తుకుని వాడికి చాక్లెట్లూ, బిస్కెట్లూ ఇచ్చారు కదా. అట్లే నీకూ ఇస్తారు. అందుకే నేను నేర్పించినవన్నీ గబగబా నేర్చుకోవల్ల. మళ్ళీ మీ నాన్నగానీ వచ్చినాడంటే ఇలా నీ వెంట పడుతున్నందుకు నన్ను కసురుతారు'' అంటూ అనుకోకుండా, అప్పటికే అక్కడ కూర్చొని ఉన్న రాఘవేంద్రను చూసింది.

''అప్పుడే వచ్చినావా? ఈరోజు ఇంత త్వరగా తగలడ్డావెందుకూ? నాకు అడ్డం తగలడానికేనా?'' అన్నట్లు ఉందా చూపు.

తను చిన్నప్పుడెప్పుడో నేర్చుకున్న కూచిపూడి నృత్యం అప్పుడప్పుడూ ఇలా కళ్ళతో కొరడాలు ఝులిపించేందుకు ఉపయోగపడుతూ ఉంటుంది. ఆమెకు వెంటనే ముఖం మీద చిరునవ్వు పులుముకుని,

''ఎంత సేపయిందండీ వచ్చీ! చూణ్ణేలేదు. వీడు చూడండి ఇప్పుడు జర్మన్ పార్లమెంట్‌ని ఏమంటారో అడగండి. ఠక్కున చెప్పేస్తాడు'' అంది కాస్త గర్వంగా.

''అవును మరి! వాడు రేప్పొద్దున కాబోయే జర్మన్ పార్లమెంటేరియన్ కదా. ఖచ్చితంగా చెప్తాడు'' అన్నాడు అప్పటికే కోపంతో ఉన్న రాఘవేంద్ర.

''అదేంటండీ అలా అంటారు? మన పిల్లల్ని మనమే ఎంకరేజ్ చెయ్యాలి. ఇదే ప్రశ్నకు ఆ ఆరేళ్ళ వాడయిన రవి సమాధానం చెబితే వాళ్ళనాన్న ఎంతబాగా మెచ్చుకుంటాడో తెలుసా? మనవాడు ఇంత చిన్న వయసుకే ఇట్లా చెబుతోంటే ఎగతాళి చేస్తారా?'' అంది బుద్ధి చెబుతున్నట్లు పోజు పెట్టి.

''అదికాదే! అసలు పార్లమెంటంటే ఏమిటో తెలీని వాడికి జర్మన్ పార్లమెంట్‌ని ఏమంటే ఎందుకు చెప్పూ'' అన్నాడు సావధానంగా క్లాసు పీకడానికి సన్నద్ధం అవుతూ. వెంటనే సునీత అప్రమత్తం అయిపోయింది.

''మీకే ఏమీ అర్థం కాదు. వీడికి పార్లమెంటు అంటే అర్థం తెలిస్తే ఎంత, తెలీకపోతే ఎంత? ఎవరయినా ప్రశ్నకు ఎంతబాగా, కరెక్టుగా సమాధానం చెబుతున్నాడో చూస్తారుగానీ, వాడికి తెలుసా, తెలీదా అని ఎవ్వరూ చూడరు'' అంది. ఆవేశంగా మూతి ముప్పై వంకర్లు తిప్పుతూ. ఇంక ఈవిడతో లాభం లేదనుకుని, బిక్కమొహం వేసుకుని వీళ్ళ వాదనను చూస్తున్న వినోద్‌తో.

''విన్నూ! త్వరగా రెడీ కాపో. ఇప్పుడు మనం ఎగ్జిబిషన్‌కి పోతున్నాం'' అన్నాడు.

''ఆయ్!'' అని ఎగిరి ఓ గంతేసి లోపలికి పరిగెత్తాడు వాడు. అప్పటికే సునీత బీపీ లెవెల్ పెరిగిపోయింది.

''ఎగ్జిబిషన్ ఎందుకు? ఇప్పుడు వాడు ఆడే ఆటలు చాలకనా? నేనేదో కష్టపడి, బతిమలాడి వాణ్ణి చదివిస్తోంటే అంతా చెడగొట్టేసారు. ఇంక ఈరోజు అంతా వేస్ట్!' రవిని వాళ్ళ అమ్మానాన్నలు ఇలా టైం వేస్టు చేయకుండా చదివిస్తున్నారు. కాబట్టే, అందరూ వాణ్ణి గొప్పగా చూస్తున్నారు'' అని తెగ బాధపడిపోయింది.

''అవును. వాణ్ణి ఎగ్జిబిషన్‌కి తీసుకుపోయే అవసరం లేకుండా వాణ్ణే ఒక ఎగ్జిబిషన్ చేసేసారు'' అని గొణుక్కుంటూ లోపలికి పోయాడు రాఘవేంద్ర.

ఇంతలో వినోద్ సొంతంగా రెడీ అయిపోయి వచ్చాడు.

సునీతకు ఇంతగా మనశ్శాంతి లేకుండా చేసిన ఆరేళ్ళ బాలమేధావి గురించి ఇక్కడ కాస్త చెప్పుకోవాలి. అదో విషాధ గాథ. ముందుగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే! రెండేళ్ళకు ముందు రవికూడా అందరిలాగే ఆడుతూ, పాడుతూ ఉండేవాడు. ముద్దు ముద్దు మాటలతో మురిపించేవాడు. వాడినాన్న సురేషు, రాఘవేంద్రలు చదువుకునే రోజుల్లోనుండే స్నేహితులు. ఇద్దరూ రెవిన్యూ ఉద్యోగులు కావడమూ, ఒకే అపార్ట్‌మెంట్స్‌లో ఉండడమూ, రవి,




రాఘవేంద్రను 'మామయ్యా' అని పిలుస్తూ ఉండడంతో ఆ రెండు కుటుంబాలూ బాగా దగ్గరయ్యాయి.

రవి ఆటపాటలు చూసి విధికి కన్ను కుట్టింది. అది ఒంటికన్నుతోటే ఆ రెండు కుటుంబాలనూ మరో స్నేహితుని పెళ్ళికి మద్రాసు వెళ్ళేలా, అక్కడ ఒక బాలమేధావుల సదస్సునుచూసేలా చేసింది. అది అంతటితో ఆగివుంటే రవిగాడికి ఇన్ని తిప్పలు వచ్చేవికావు. అది అలా చేయదు. ఎందుకంటే విధి బలీయమైంది కాబట్టి, రాఘవేంద్రలోకి దూరి, ఆ బాలమేధావులని తెగ పొగిడేస్తున్న సురేష్‌తో...

''అంతెందుకు వాళ్ళకి మన రవి ఏమీ తీసిపోడు లేరా'' అని అనిపించింది. అంతే సురేష్ మెదడులో ఆలోచన మెరుపులా మెరిసి, రవి నెత్తిన పిడుగు పడింది. అప్పటికి ఆ విధి శాంతించి, తన పనైపోయిందిగా ఇంక హాయిగా వీడి బాధలు చూసి ఆనందించవచ్చని వెళ్ళిపోయింది.

అంతే మరుసటి రోజునుండే రవిని బాలమేధావిగా తీర్చిదిద్దేందుకు కావలసిన ఆయుధాలు సిద్ధం చేసుకున్నాడు సురేష్. వెంటనే ఒక పెద్ద అల్మారాలోని గూళ్ళనీ–

అరచేతిలో ఆంధ్రప్రదేశ్, జనరల్ క్విజ్, అరచేతిలో విశ్వవిజ్ఞానం, జీకేలో విజయ రహస్యాలూ, మెగా ఆబ్జెక్టివ్ జనరల్ వ్యాల్యూమ్1, వాల్యూమ్2, వాల్యూమ్3, జనరల్ నాలెడ్జ్ క్విజ్ 3000 ప్రశ్నలు–జవాబులు, వండర్స్ ఆఫ్ ది వరల్డ్, రెడ్డి మెగా క్విజ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్, హూ ఈజ్ హూ, బుక్ ఆఫ్ నాలెడ్జ్, బ్రిలియంట్ జనరల్ నాలెడ్జ్ లాంటి పుస్తకాలతో నిండిపోయాయి. పైగా 'బాలమేధావిని తయారు చేయడం ఎలా?', 'మీ పిల్లల్లోని తెలివితేటలని గమనించండి' వంటి పుస్తకాలూ వాళ్ళింట్లో చేరిపోయాయి.

'కేజీలకు కేజీలు బరువున్న ఆ పుస్తకాలు మోయాలంటే రవిగాడి కథేమోగానీ ఎవరికయినా బలం చాలదు. ఒక శేరు అన్నం ఎక్కువ తినాల్సిందే' అనుకుంటూ ఉంటాడు రాఘవేంద్ర. మొదట్లో ఓ బాలమేధావి తయారీకి తనూ ఓ కారణమని తెగ మురిసిపోయేవాడు. తర్వాత అంతకంటే ఎక్కువగా సిగ్గుపడుతున్నాడు.

దానికి కారణం లేకపోలేదండోయ్! అసలు అప్పటినుండీ రవిగాడి పరిస్థితి వివరిస్తే గానీ మనకర్థం కాదు. ఆరోజు నుండీ రవికి ముందు జిల్లాస్థాయిలో ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో, దేశస్థాయిలో, ప్రపంచ స్థాయిలో ప్రముఖుల గురించి నేర్పించే యజ్ఞం ఆరంభమయింది. స్కూలుకు కూడా పోనీయకుండా–

ఉదయం ఆఫీసుకు పోయేంతవరకూ వాడిచేత కంఠస్తం కొట్టించే డ్యూటీ సురేష్‌ది. ఆ తర్వాత సమయమంతా రవివాళ్ళ అమ్మ లక్ష్మిది. ఒకరోజు లక్ష్మి రవిచేత కంఠతా కొట్టించే క్రమంలో ''మనిషి చనిపోయిన తర్వాత కూడా పెరిగే అవయవాలు గోళ్ళూ, వెంట్రుకలు. చెప్పూ'' అంది లక్ష్మి.

దానికి ''మమ్మీ! అవి అట్లా ఎందుకు పెరుగుతాయి?'' వాడి ధర్మసందేహం అది.

''నోర్మూసుకుని చెప్పింది నేర్చుకో. ఇట్లా అడ్డమయిన ప్రశ్నలూ వేస్తే ఈ రోజంతా ఈ ప్రశ్న నేర్చుకోడానికే సరిపోతుంది'' అంది. కానీ అవి అలా ఎందుకు పెరుగుతాయో లక్ష్మికి గానీ, సురేష్‌కి గానీ ఏం తెలుసు? వాళ్ళ ఉద్దేశంలో అసలా విషయం ఎవరికీ తెలియనవసరం లేదు. అది కేవలం గుర్తుంచుకోవలసిన ప్రశ్నే! అంతటితో రవి మరిక ఏ ప్రశ్నలోనూ ధర్మసందేహాలు రాకుండా అయిపోయినాయి.

ఓసారి లక్ష్మి వాళ్ళ ఇంటికి వాళ్ళ అక్కయ్యలూ, చెల్లెల్లూ, పిల్లలూ అందరూ వచ్చారు. కుశల ప్రశ్నలు అయిపోవడమే ఆలస్యం రవిచేత 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' పద్యం చెప్పించింది. అంతటితో ఊరుకోక–

''చూడండీ! ఈ పోయమ్ ఎవరయినా చెబుతారు. కానీ దాన్ని రాసింది ఎవరో రవి చెప్తాడు'' అంది. శాటిలైట్ టీవీ లైవ్ ప్రోగ్రామ్‌లో యాంకర్ లాగా వాడు తడుముకోకుండా 'అన్నా అండ్ జేన్ టేలర్' అన్నాడు.

వాళ్ళంతా ఆశ్చర్యపోతూంటే

''ప్రపంచంలో చిన్న పక్షి ఏది?'' అడిగింది లక్ష్మి.

''హమ్మింగ్ బర్డ్'' చెప్పాడు వాడు.

''వేయి సరస్సులు ఏ దేశంలో వున్నాయి'' లక్ష్మి ప్రశ్న.

''ఫిన్లాండ్'' రవి జవాబు.

ఇక అంతే అప్పటినుండీ సురేష్‌గానీ, లక్ష్మిగానీ ఎక్కడికీ రవిలేకుండా వెళ్ళనే లేదు. అది షాపింగ్ అయినా, షికారు అయినా ఒక్క అయిదు నిమిషాలు టైం దొరికితే చాలు వాడిచేత చిన్న ప్రదర్శన ఇప్పించాల్సిందే. ఆఖరుకి సురేష్ తన సరదాగా స్నేహితులను కలవడానికి వెళ్ళినా కూడా వెంట రవీ, వాడి ప్రదర్శనా తప్పనిసరి అయిపోయాయి.

రవివాళ్ళ స్కూల్లో కూడా ఒక ప్రదర్శన ఇప్పించేశాడు. అప్పుడు ఒక ఎంఎల్ఏ చేత అవార్డు ఇప్పించారు. ఆ విషయాన్ని వివిధ పత్రికలూ, లోకల్ టీవీ ఛానెల్ వాళ్ళూ కవర్ చేసారు. దాంతో రవిమీద పడ్డ పిడుగు రెండింతలయింది.

రవికి వాళ్ళమ్మ గోరుముద్దలు తినిపించే టైంలో కూడా ప్రశ్నలు కంఠతా చేయిస్తూనే వుంటుంది. అప్పుడు ఆమె చేతిలోని అన్నం గిన్నెలోని అన్నం అంతా జీకే బుక్కు ముక్కల్లాగా కనిపిస్తూ ఉంటాయి రాఘవేంద్రకు. చివరికి వాడు నిద్రపోయేటప్పుడు కూడా ప్రశ్నలను రికార్డ్ చేయించి, వాక్‌మెన్‌లో పెట్టి చెవిలో పెట్టడం మొదలెట్టారు.

ఇదీ క్లుప్తంగా రవిగాడి గతం.. ఈ మధ్యనే సురేష్‌కి, రాఘవేంద్రకీ స్నేహితుడైన నరేష్ అనే ఓ పొలిటికల్ సైన్సు లెక్చరర్ సురేష్ వాళ్ళ ఇంటికి వచ్చినప్పుడు...


''ఒరే నరేష్... నువు పొలిటికల్ సైన్సు లెక్చరర్‌వి కదా! నీ సబ్జెక్టుకు సంబంధించి ఏవయినా ప్రశ్నలడగరా, దేనికయినా మావాడు ఠకఠకా చెప్పేస్తాడు'' అన్నాడు గర్వంగా సురేష్.

నరేష్ బాగా ఆలోచించి వాడి వయసును దృష్టిలో వుంచుకుని–

''మన జాతీయ జెండాకు ఎన్ని రంగులు వుంటాయి?'' నరేష్ ప్రశ్న.

''మూడు రంగులు, మధ్యలో అశోక చక్రం'' రవి జవాబు.

''మన జాతీయ జెండాను రూపొందించింది ఎవరు?'' ప్రశ్న.



"శ్రీ పింగళి వెంకయ్యగారు!" జవాబు. అప్పటికే ఆ ప్రశ్నలకు సురేష్ చిర్రెత్తుకొచ్చింది.

"ఏమిట్రా ఆ ప్రశ్నలు. అవి ఎవర్న డిగినా చెబుతారు. మనదేశ జెండా గురించి కాదురా, వేరే ఏ దేశ జెండా గురించయినా అడుగు. ఏదేశ రాజధాని గురించయినా అడుగు. మావాడు చెప్పేస్తాడు" అన్నాడు.

దాంతో నరేష్ బాగా ఆలోచించి...

"ఐక్యరాజ్యసమితి జెండా ఎలా వుంటుంది?" ప్రశ్న.

"రెండు ఆలివ్ ఆకులమధ్య ప్రపంచం" జవాబు.

"ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడెవరు?" ప్రశ్న.


"కోఫీ అన్నన్.. ఘనా దేశస్థుడు" జవాబు.

"ఇప్పుడు పురాణాల గురించి అడగరా అవి కూడా చెబుతాడు" అడ్డు తగిలాడు సురేష్.

"పురాణాల గురించి నాకు అంత అయిడియా లేదురా" అన్నాడు సురేష్. అయితే మాత్రం ఇప్పుడు వాడిచేత నరేష్‌కు పురాణాల గురించి చెప్పించకుండా ఎలా ఉండడం. అందుకే-

"అయితే నేనే అడుగుతానుండు" అన్నాడు సురేష్.

"హిందూ పురాణాలలో ముఖ్యమైనవి ఎన్ని?" సురేష్ ప్రశ్న.




"18" రవి జవాబు.

"రాముని వంశం పేరు?" ప్రశ్న.

"ఇక్ష్వాకుల వంశం" జవాబు.

"జనక మహారాజు భార్యపేరు?" ప్రశ్న.

"సునయన" జవాబు.

దాంతో నరేష్ ఫ్లాట్ అయిపోయాడు. రవిని సురేష్‌ని తెగ మెచ్చుకుని బయటకు వచ్చిన తర్వాత కూడా రాఘవేంద్రతో-

"అబ్బా! వాడు ఎంత తెలివైన వాడురా! ఏదడిగినా చెప్పేస్తాడు. నాకు భలే ఆశ్చర్యం వేసింది" అన్నాడు తల పట్టుకున్న రాఘవేంద్ర సావధానంగా.

"ఏరా! ఒక లెక్చరర్‌వి అయివుండీ, ఇలా మాట్లాడుతున్నావు. వాడింట్లో ఎన్ని జీకే బుక్కులున్నాయో చూసావుగా! రెండేళ్ళనించీ రవికి వాడు రోజుకి 10 ప్రశ్నల చొప్పున నేర్పించాడు. ఇప్పటికి వాడికి దాదాపు 10 వేల ప్రశ్నలకు జవాబులొచ్చు. నువ్వు ఎంతడిగినా ఆ పదివేల లోపువేగా! నాకు మాత్రం తెలీదా ప్రతిమనిషి మెదడూ ఒక లక్ష కంప్యూటర్లు గుర్తుపెట్టుకునేంత సమాచారాన్ని గుర్తుంచుకోగలదని, ఇవి నేర్పించడానికి వాణ్ణి కనీసం స్కూలుకు కూడా సరిగ్గా పంపరు. జీకే బుక్కుల్లో కంటే ఆడుతూ పాడుతూ చదువుకోవడం వల్ల పిల్లలు ఇంకా ఎక్కువ నేర్చుకుంటారనీ, అదే అపురూపమైనదనీ వాడికి నేను ఎన్నిసార్లు చెప్పినా వాడు వినిపించుకుంటేనా" అన్నాడు.

అవునన్నట్లు తలూపి వెళ్ళిపోయాడు నరేష్.

అదలా వుంటే మరోవైపు సునీత గొడవ.

"ఏమండీ! అసలు మన వినోద్ ఆ రవికేమీ తీసిపోడులెండి. వీణ్ణి కూడా మనం అన్నీ నేర్పించి బాలమేధావిగా తయారు చేద్దామండీ" అంది బతిమాలే ధోరణిలో.

"చూడు సునీతా! వినోద్ కూడా రవిలాగే అన్నీ నేర్చుకోగలడు. అదేం అంత పెద్ద విషయం కాదు. కానీ, నువ్వు ముందు ఓ విషయం అర్థం చేసుకో



వాలి. ఉదాహరణకు రవినే తీసుకో. వాడికి వాళ్ళ అమ్మానాన్న నేర్పిస్తున్నారు, వాడు నేర్చుకుంటూనే ఉన్నాడు. ఇప్పుడయితే చిన్నవాడు కాబట్టి సరిపోయింది. కానీ ఇదే అలవాటయితే ఇంక జీవితాంతం వాడు ఎవరయినా నేర్పిస్తే తప్ప ఏదీ నేర్చుకోలేడూ, తెలుసుకోలేడూ. సొంతంగా ఎందుకూ? ఏమీ? అని ఆలోచించలేడు. వాడి మెదడు కేవలం గుర్తుంచుకోవడానికి మాత్రమే పరిమితమయి పోతుంది. వాడిలో సృజనాత్మకత నశించి పోతుంది'' అన్నాడు. సునీత ఏమీ మాట్లాడక పోవడంతో రెట్టించిన ఉత్సాహంతో స్టేజిమీద మైకాసురుడికి మైకు దొరికినంత ఆనందంతో–


''అది కాదు సునీ! నీకు ఒక చిన్న ఉదాహరణ చెబుతా చూడు. అప్పుడు నీకే అర్థమయిపోతుంది. మొన్న ఎప్పటిలాగే సురేష్ రవిని మా స్నేహితులందరం కలిసే చోటుకి పిలుచుకు వచ్చాడు. 'మీరు ఏ ప్రశ్నయినా అడగండిరా. మా వాడు సమాధానం చెబుతాడు' అన్నాడు కాస్త గర్వంగా. వాడు ఎప్పటిలాగే జవాబులు చెబుతున్నాడు. ఇంతలో ఒకడు 'ఇప్పుడు సానియా మీర్జా ర్యాంక్ ఎంతరా' అని అడిగాడు. వాడు '34' అని చెప్పాడు. వెంటనే మావాడు కాదు '31' అని అన్నాడు. మరోసారి 'జిల్లా కలెక్టర్ ఎవరు?' అని ఇంకొకడు అడిగాడు. రవి 'రాజశేఖర్' అన్నాడు. పాపం వానికి ఆ కలెక్టర్ మారి, అనురాధ కలెక్టరయిన విషయం, సానియా మీర్జా ర్యాంకు మారిన విషయం నేర్పిస్తే కదా తెలిసేది. ఈ మార్పు తిరిగి కంఠతా చేయించేంత వరకూ పాపం వాడు ముందువే చెబుతుంటాడు. ఇప్పుడు అర్థమయిందా వాడు బాగా గుర్తుపెట్టుకుంటాడు కానీ, ఎప్పటికీ నేర్పిస్తూనే వుండాలి. మన వినోద్ కూడా అలా తయారవడానికి నేనెంత మాత్రమూ ఒప్పుకోను'' అని తెగేసి చెప్పాడు రాఘవేంద్ర.

* * *

నాలుగు రోజుల తర్వాత రెవెన్యూ వాళ్ళ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో జరిగే 'బాల మేధావి పోటీ'లో రవిని ఒకడినిగా చేర్చేశాడు సురేష్. ఆరోజు 'కృష్ణ కళా మందిరం' ఆడిటోరియం అంతా ఉద్యోగుల్తో, పిల్లల్తో నిండిపోయింది. ముఖ్యంగా నాలుగైదేళ్ళ పిల్లల్ని ప్రతి తల్లిదండ్రి తీసుకువచ్చి ఈ బాలమేధావులను చూపించి, నువ్వు కూడా అలా తయారుకావాలని చెబుతున్నారు.

రాఘవేంద్రకు మాత్రం ఆ తల్లిదండ్రులందరూ సింహాల్లాగా, తమ దగ్గరున్న కుందేలు పిల్లలకు స్టేజిమీద ఉన్న కుందేలు పిల్లలను చూపిస్తూ 'మీరు ఎంచక్కా అలా బలైపోవాలి' అని చూపిస్తున్నట్లనిపించింది.

స్టేజీమీదకు బాలమేధావి అనబడే ఒక్కో అమాయకపు కుందేలూ వచ్చి, వేటగాడి ముందు నిలబడ్డట్టు ప్రశ్నలడిగే యాంకర్ ముందు నిల్చుంటున్నారు. లేలేత కుందేళ్ళను ఆబగా చూస్తూ ఆ యాంకర్ ప్రశ్నలడుగుతున్నాడు. ఆ పిల్లల మొహాల్లో గానీ, కళ్ళలో గానీ గెలుస్తామనే ఉత్సాహంగానీ, ఉద్వేగంగానీ కనిపించలేదు రాఘవేంద్రకు. ఏదో ప్రశ్నలడుగుతున్నారు చెబుతున్నాం అన్నట్టున్నాయి మొహాలు. వాళ్ళ కళ్ళలో మాత్రం శూన్యమే ఉంది.



రవి వంతు వచ్చింది. కానీ వాడి మొహంలో ఏదో మార్పు. యాంకర్ ప్రశ్నల బాణాల్ని సంసిద్ధం చేసుకున్నాడు.

''మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు'' ప్రశ్న.

''వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి'' జవాబు.

''మన రాష్ట్ర పక్షి ఏది'' ప్రశ్న.

''చిలక'' జవాబు, ఆడిటోరియంలో నవ్వులు.

''మన హోంశాఖా మంత్రి ఎవరు?'' ప్రశ్న.

''మన్‌మోహన్ సింగ్'' జవాబు. మళ్ళీ నవ్వులు.

అలాగే దాదాపు అడిగిన ప్రశ్నలన్నింటికీ రవి సమాధానాలు తప్పుగా చెబుతున్నాడు. రాఘవేంద్ర, సురేష్, లక్ష్మిల మొహాల్లో ఆశ్చర్యంతో నిలువు గుడ్లుపడ్డాయి. సురేష్ మొహం ఎర్రగా కందిపోయింది కోపంతో. వాడు స్టేజి దిగి రాగానే పూనకం వచ్చినట్లు ఒకటే బాదుడు! సురేష్‌ని ఆపి, రవిని ఓదార్చేందుకు పక్కకు తీసుకెళ్ళాడు రాఘవేంద్ర.

''పోనీలే! ఏడవద్దు. ఈసారి బాగా చెబుదువులే'' అన్నాడు.

దానికి వాడు–

''మామయ్యా! ఇంక నేను ప్రతిసారీ ఇట్లే చేస్తాను. అప్పుడు నేను ముందులాగా ఆడుకోవచ్చు. స్కూలుకు పోవచ్చు. ఎక్కువసేపు నిద్రపోవచ్చు'' అన్నాడు గుసగుసగా. వాడు ఏడుపు ఎప్పుడో ఆపేశాడు. అంత వరకూ వాడి కళ్ళలోని శూన్యం కన్నీళ్ళలో జారిపోయి కళ్ళు మెరుస్తున్నాయి!

'వామన వృక్షం తిరిగి భూమిలో నాటుకుని పెరగనారంభించింది' అనుకున్నాడు రాఘవేంద్ర.